RNI NO. TELTEL/2023/87655
4-05-2025
# దీక్ష ప్రభ
ఆదివారం
www.deekshaprabha.com
Follow: deekshaprabha
సంపుటి : 03 సంచిక : 28 పేజీలు : 4 | రూ.5

## హైదరాబాద్ చేరుకున్న మిస్ కెనడా సుందరి

**హైదరాబాద్,దీక్షప్రభ:** హైదరాబాద్‌లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న వివిధ దేశాల సుందరీమణుల రాక ప్రారంభమ యింది. ఈ మిస్ వరల్డ్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6 వ తేదీ నుండి హైదరాబాద్ కు చేరుకుంటారు. మిస్ కెనడా మిస్ ఎమ్మా డీనా కాథరిన్ మోరిసన్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు శనివారం సాయంత్రం చేరుకున్నారు. శంషాబాద్ కు చేరుకున్న మిస్ కెనడా కు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు.



## మోడీతో కాశ్మీర్ సీఎం ఒమర్ భేటీ

**న్యూఢిల్లీ,దీక్షప్రభ:** జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. పహల్గామ్ ఉగ్రవాద ఘటన జరిగిన తర్వాత ఈ సమావేశం జరగడం ఆసక్తికరంగా మారింది. ఉగ్రదాడిపై ఇరువురు నేతలు చర్చించినట్లు- అధికారులు తెలిపారు. ప్రధాని మోడీ నివాసంలో దాదాపు 30 నిమిషాల పాటు భేటీ కొనసాగింది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత తొలిసారిగా ఇరువురు నేతలు కలుసుకున్నారు. భారత్, పాకిస్తాన్‌పై దాడి చేస్తుందని, పీఓకేని స్వాధీనం చేసుకుంటు-ందనే ఊహాగానాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యతన ఏర్పడింది. ఇటీవల, జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించారు. పాకిస్తాన్‌కి చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడికి బాధ్యత ప్రకటించింది. ఈ దాడిలో పాకిస్తాన్ ఆర్మీ, ఐఎస్ఐ ప్రమేయం ఉన్నట్లు- స్పష్టంగా తెలుస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.



## అమరావతి అభివృద్ధితో ఎపికి మహర్దశ

### ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన చంద్రాబు

### ఎపి అభివృద్ధిలో బాగస్వామ్యం కావడంపై మోడీ హర్షం

**అమరావతి,దీక్షప్రభ:** ప్రజల సహకారం, కేంద్ర మద్దతు, పక్కా ప్రణాళికతో అమరావతిని నిర్మిస్తామని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భారత్ ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా పునర్నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం జరిగిందని అన్నారు. పునర్నిర్మాణ పనుల ప్రారంభం విజయవంతంపై ఎక్స్ లో సిఎం స్పందించారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియా, సోషల్ మీడియాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదకశక్తిగా

మిగతా 2లో..



# కేంద్రం కులగణన నిర్ణయం

## రాష్ట్ర ప్రభుత్వం విజయం: భట్టి

**ఖమ్మం,దీక్షప్రభ:** కేంద్ర ప్రభుత్వం కులగణనపై తీసుకున్న తాజా నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయానికి నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని మల్లన్నపాలెం గ్రామంలో రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిగా కులగణన చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టు-కుని ప్రభుత్వం అన్ని నిర్ణయాల్లో కులగణనను పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. కులగణన సర్వే ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలన్న డిమాండ్ చేసిన సంగతి ఆయన గుర్తు చేశారు. కానీ అప్పట్లో కేంద్రం స్పందించకపోయినప్పటికీ, ఇప్పుడు ప్రజల ఒత్తిడికి తలొగ్గి కులగణన చేపట్టేందుకు ఒప్పుకున్నట్టు- తెలిపారు. ఇన్నాళ్లు రాష్ట్రంలో జరిగిన కులగణనను విమర్శించిన బీజేపీ ఇప్పుడు అదే మార్గాన్ని అనుసరించడాన్ని సానుకూల పరిణామంగా అభివర్ణించారు. రాష్ట్రంలోని బీసీలు ఎల్లప్పుడూ ప్రభుత్వానికి అండగా నిలవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## ధాన్యం దిగుబడుల్లో తెలంగాణ నంబర్ వన్

### రైతులకు అందిస్తున్న సహకారంతోనే సాధ్యం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హనుమకొండ,దీక్షప్రభ:** ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల వైఖరికి ధాన్యం దిగుబడే నిదర్శమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని చరిత్రాత్మక అంశంగా పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీకి మించిన సంక్షేమ పథకం

మిగతా 2లో..

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

- అవినీతికి చోటు లేకుండా కఠిన చర్యలు
- పేదలకే ఇళ్లు దక్కేలా చూసే బాధ్యత మీదే
- యువ ఇంజనీర్లకు మంత్రి పొంగులేటి సూచన



2లో

## రహదారుల అభివృద్ధితోనే పెట్టుబడులు సాధ్యం

### తెలంగాణలో రహదారుల విస్తరణకు కృషి

### రేపు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి గడ్కరీ రాక

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,దీక్షప్రభ:** రహదారులు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 5న కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ తెలంగాణకు రానున్నారు. 5,416 కోట్ల రూపాయలతో 26 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన

మిగతా 2లో..

## మిస్ వరల్గడ్ పోటీలకు భారీగా ఏర్పాట్లు

### లోటుపాట్లు లేకుండా చూడాలని సిఎస్ ఆదేశం

**హైదరాబాద్,దీక్షప్రభ:** ఈ నెల 10వ తేదీ నుండి హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ 2025కు సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు సీనియర్ పోలీసు అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో శనివారం తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుండి -టె-లికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత స్థాయి ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి

మిగతా 2లో..

## తెలంగాణలో మూడ్రోజులు వర్షాలు

### పలు జిల్లాలకు వాతావరణశాఖ హెచ్చరిక



**హైదరాబాద్,దీక్షప్రభ:** తెలంగాణలో వాతావరణం ఒక్కోలా మారిపోతుంది. అప్పటి వరకు వేడి గాలులు, ఎండవేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు సాయంత్రం కాగానే చల్లటి వాతావరణం ఉపశమనాన్ని ఇస్తోంది. అంతేకాకుండా ఉన్నట్టుండి వర్షాలు కూడా పడుతున్నాయి. ఉదయం ఎండగా ఉంటూ.. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో

మిగతా 2లో..

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు.. కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..వారి సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలకు దిక్సూచిగా మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..!!

దీక్ష ప్రభ
తెలుగు దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి

95500 21491

మీకో చక్కని వేదికగా నిలుస్తోంది. ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.

## ఎమ్మెల్సీ ఎన్నికల కొడ్‌తో ఆలస్యం

### సన్నం బియ్యం పంపిణీపై మంత్రి పొన్నం వెల్లడి

### హిమాయత్ నగర్‌లో బియ్యం పంపిణీ ప్రారంభించిన మంత్రి

**హైదరాబాద్,దీక్షప్రభ:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్లే హైదరాబాద్‌లో రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ ఆలస్యమైందని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హిమాయత్ నగర్ ఆదర్శ బస్తీలో పౌరసరఫరాల దుకాణం 602లో లబ్ధిదారులకు సన్న బియ్యం ఆయన సన్న బియ్యం పంపిణీ చేశారు. అనంతరం నారాయణగూడ గాంధీ కుటీర్ వద్ద సన్న బియ్యం లబ్ధిదారుడు ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. భారతదేశంలో మొదటిసారి ధనవంతుడు, పేదవాడు అనే తేడా లేకుండా.. అందరూ సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో కాంగ్రెస్

మిగతా 2లో..



# అమరావతి అభివృద్ధితో ఏపికి మహర్దశ



(మొదటిపేజీ తరువాయి)
నిలిచేలా నిర్మాణం జరుగుతుందని చెప్పారు. తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతి పునః ప్రారంభంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ లో ప్రధాని ఇలా రాసుకొచ్చారు.. అమరావతి అభివృద్ధిలో నూతన, చారిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర, సోదరీమణుల మధ్య ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుంది.. ఇది ఆంధప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగు పరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను అని చెప్పుకొచ్చారు. నాకు మంచి మిత్రుడు, ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతి పట్ల ఉన్న దార్శనికత, రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను నేను అభినందిస్తున్నాను అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు.

ఇక, ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అని సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను అన్నారు. కాగా, ప్రజల సహకారంతో, కేంద్రం మద్దతుతో పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీ-గా రాజధాని అమరావతిని నిర్మిస్తాం అని హామీ ఇచ్చారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి.. మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని తెలుపుతూ.. ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని చంద్రబాబు వెల్లడించారు. మరోవైపు, రాజధాని అమరావతి నిర్మాణ పనులను ఏపీ ప్రభుత్వం వేగవంతం చేస్తుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పునః ప్రారంభోత్సవం కార్యక్రమం పూర్తి కావడంతో పనులు వేగవంతం చేసింది. ఐకానిక్ భవనాల డిజైన్లు ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే డిజైన్లు రూపొందిస్తున్న సంస్థలతో మంత్రి నారాయణ మాట్లాడుతున్నారు. సీఆర్డీయే కార్యాలయంలో నార్మన్ పోస్టర్, హాఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ- సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశం అయ్యారు. ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాల తుది డిజైన్లపై కసరత్తు చేస్తున్నారు. ఆయా భవనాల డిజైన్లను మంత్రి, అధికారులకు ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు వివరిస్తున్నారు.

# ధాన్యం దిగుబడుల్లో తెలంగాణ నంబర్ వన్

(మొదటిపేజీ తరువాయి)
మరొకటి లేదన్నారు. అర్హులైన పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెరిఫై చేసిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని.. రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో చారిత్రక, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సన్న బియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్న ప్రభుత్వం తమదేనని.. ఎంత ఖర్చైనా సరే నిరుపేదలకు సన్న బియ్యం అన్నం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్, వ్యవసాయ శాఖలకు ప్రాధాన్యత ఇస్తున్నామని.. ఇందులో భాగంగానే ఏ రాష్ట్రంలో పండని విధంగా తెలంగాణలో వానాకాలం, యాసంగిలో వరి పండిందని తెలిపారు. రాష్ట్రంలో 2.80 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని.. రెండు సీజన్లలో రబీ, యాసంగి సీజన్లలో సన్న ధాన్యానికి రూ.500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ఇస్తోందని.. ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐకు ధాన్యం అమ్మే రాష్ట్రాల్లో తెలంగాణే ముందు వరుసలో ఉందని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. దేవున్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్‌ను కూడా సందర్శించామన్నారు. భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులను, సుందరీకరణ పనులను భారీ స్థాయిలో చేపట్టామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖను ప్రక్షాళన చేస్తున్నట్లు- తెలిపారు. ఈ శాఖలోని అన్ని సమస్యలను రెండేళ్లలో అధిగమిస్తామన్నారు. సీతమ్మసాగర్‌కు 68 టీ-ఎంసీల గోదావరి జలాలు కేటాయించామన్నారు. కేంద్రంతో అనేక సార్లు చర్చించి నీటి వాటాను దక్కించుకున్నట్లు ఉత్తమ్ తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను ఈ సీజన్‌లో పూర్తి చేస్తామన్నారు. రైతులకు నీరందించి సాగును సస్యశ్యామలంగా చేయడానికి కృషి చేస్తిన్నామన్నారు. రైతన్నల అద్భుతంగా పంటలను పండించారన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రైతుల నుంచి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు అందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆలస్యం

(మొదటిపేజీ తరువాయి)
ప్రభుత్వం ఉగాది పండగ నుంచి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమని.. ఈ పథకం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఎన్నికల కోడ్ వల్ల ఏప్రిల్ నెలలో సన్న బియ్యం పంపిణీ చేయలేదన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి హైదరాబాద్‌లోని 653 రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. కనీసం మార్పులు చేర్పులు కూడా చేయలేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం కుల గణన సర్వే, ప్రజా వాణి అప్లికేషన్, రెగ్యులర్‌గా ఎమ్మార్వో ఆఫీస్‌ల నుంచి వచ్చిన అప్లికేషన్‌ల ద్వారా రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ జరుగుతుందన్నారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధిపై ముందుకు వెళ్తామన్నారు. హైదరాబాద్ ప్రజలు ఈ సన్న బియ్యం పథకాన్ని ఉపయోగించుకొని ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# మిస్ వరల్గడ్ పోటీలకు భారీగా ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)
ఇటివల నిర్వహించిన సమీక్ష సమావేశంలో సూచించిన విధంగా చేపట్టిన ఏర్పాట్ల పై సవివరమైన నివేదికను అందించాలని సీఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుండి వచ్చే అతిథులకు ఎటు-వంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు- చేయాలని పోలీసు శాఖ ను ఆదేశించారు. విమానాశ్రయం, హోటల్స్, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే వేదికల వద్ద గట్టి భద్రతను కల్పించాలన్నారు. పోటీ-దారుల కోసం సవివరమైన బుక్‌లెట్ సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని జీహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. డీజిపి జితేందర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, ఇతర అధికారులు ఈ టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# తెలంగాణలో మూడ్రోజులు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)
ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ఇదిలా ఉండగా.. తెలంగాణలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటనచేసింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు ముంచెత్త నున్నట్లుపేర్కొంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం పూట ఎండలు దంచికొట్టినప్పటికీ సాయంత్రం వేళల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని.. ఈదురుగాలులతో కూడిన వర్షం పడనున్నట్లు- వెదర్ రిపోర్ట్ చెబుతోంది. రాష్ట్రంలో ఏయే జిల్లాలో వర్షాలు పడతాయనే విషయాన్ని కూడా వాతావరణ వాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్ నల్లగొండ, వరంగల్, జనగాం, సూర్యాపేట, కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమంగా ఉండగాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలకు రైతులు అల్లాడిపోతున్నారు. ఇటీ-వల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం కురవగా.. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి రాకముందే వర్షానికి దెబ్బతినడంతో రైతులు బాధ వర్ణణాతీతమనే చెప్పుకోవాలి. ఈదురుగాలలు, ఉరుములు, మెరుపులతో పాటు- వడగళ్ల వర్షంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది.



# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం



**హైదరాబాద్,దీక్షప్రభ:** పేదోడి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది రూ.22వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ప్రకటించారు. పైలట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోందని అన్నారు. మిగిలిన గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక కొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ లో శిక్షణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. హౌసింగ్ కార్పొరేషన్‌లో 350 మంది ఔట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆరు రోజులపాటు అధికారులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికెట్లు- అందజేశారు. అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్-2లో పనిచేస్తున్న10 మంది సబ్ రిజిస్ట్రార్లను గ్రేడ్-1కి, సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న 11 మందికి గ్రేడ్-2 పదోన్నతులు కల్పించింది. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందరభంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదన్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళు కేటాయిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు సక్సెస్ కావాలంటే యువ ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. ఇందిరమ్మ ఇండ్లకోసం శిక్షణ పూర్తిచేసుకున్న 390 మందియువ అసిస్టెంట్ ఇంజనీర్లంతా ఇందుకు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలా? ఇతర పార్టీలా అన్ని పార్టీల వారికి.. అర్హులైన పేదలకే ఇండ్లు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవారికి అందాలంటే అది పేద కుటుంబాల నుంచి వచ్చిన యువ ఇంజనీర్లకే తెలుసన్నారు. ఎవరూ ప్రలోభాలు పెట్టినా డబ్బుకు ఆశపడొద్దని హెచ్చరించారు. 600 చదరపు మీటర్ల లోపే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని.. ఎక్కు జాగలో ఇళ్లు కడితే తర్వాత వచ్చే డబ్బులు ఇవ్వబోమన్నారు. మొత్తం నాలుగు దశల్లో నిధులు విడుదల అవుతుందన్నారు పొంగులేటి. గ్రౌండ్ లెవల్ లో ప్రతి ఇంటిని పరిశీలించే బాధ్యత యువ ఇంజనీర్లదేనన్నారు. ప్రతి సోమవారం అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల నిధులు రిలీజ్ చేస్తామన్నారు. డబ్బులు రిలీజ్ చేశాక ప్రతి ఇంటిని పరిశీలిస్తామని చెప్పారు.

# పునరుజ్జీవన దిశగా ప్రాణహిత-చేవెళ్ల

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**కామారెడ్డి,దీక్షప్రభ:** జిల్లాలోని మల్టీస్టేజ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన ప్రాణహిత-చేవెళ్ల పునరుజ్జీవన దిశగా సాగుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అనంతరం మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి ప్రజల జీవనాధారం ఈ ప్రాజెక్టు అని పేర్కొన్న ఆయన, ప్రాజెక్టు పూర్తయితే కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో రూ.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఇటీ-వల ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమీక్షలో కూడా ప్రాజెక్టు పురోగతిపై చర్చించామని తెలిపారు. కొండం చెరువు వద్ద ప్రాణహిత ప్రాజెక్టు ప్రాథమికంగా 0.80 టీ-ఎంసీలకు డిజైన్ చేయబడిందని, అయితే గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ దీనిని 3.5 టీ-ఎంసీలకు పెంచారని షబ్బీర్ అలీ వివరించారు. ఇది వల్ల 9 గ్రామాలు , తండాలు ముంపుకు గురవుతాయని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇటీ-వల జరిగిన సమీక్షలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సైతం అభ్యంతరాలు తెలిపారని వెల్లడించిన షబ్బీర్ అలీ, త్వరలో పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పురోగతిలో భాగంగా ప్రభుత్వంస్థాయిలో భూసేకరణకు రూ. 23.15 కోట్ల నిధులు విడుదల చేయబడ్డాయని షబ్బీర్ అలీ తెలిపారు. దీంట్లో భాగంగా మొదటి విడతగా 316 ఎకరాల భూసేకరణను చేపట్టనున్నట్లు-, మొత్తం 619 మంది రైతులకు పరిహారం చెల్లించే పక్రియ ప్రారంభం అయిందని పేర్కొన్నారు. తిమ్మక్‌పల్లి వద్ద 1.4 టీ-ఎంసీల పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తామని, వెంటనే రెండో విడత భూసేకరణ ప్రారంభమవుతుందన్నారు. మొత్తం ప్రణాళిక ప్రకారం కామారెడ్డి నియోజకవర్గంలో 80 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు.

# వర్షాలతో కల్లాల్లోనే తడిసిన ధాన్యం

- పలుచోట్ల నీట మునిగిన పంటలు

**ఖమ్మం,దీక్షప్రభ:** రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఓ పక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తుంటే .. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కాంటాల కోసం రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. రోజుల తరబడి వడ్లు కాంటా పెట్టకపోవడంతో ఆరిన వడ్లు మళ్లీ.. తడుస్తుండడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాంటాలు పెట్టించడంలో ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సెంటర్లు ఏర్పాటుచేసి కాంటాలు పెట్టేలోపే వాన పడడంతో ఇబ్బందులు తలెత్తాయని అన్నారు.. ఈ పరిస్థితుల్లో కొన్ని చోట్ల కాంటాలు పెట్టడం ఆలస్యం అయ్యింది. కాంటాలు చేయటంలో ఎక్కడా ఆలస్యం చేయడం లేదన్నారు. సకాలంలో కాంటాలు పెట్టి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు వాపోతున్నారు. మా ఆరుగాలపు శ్రమ ఫలించింది. పంట చేతికొచ్చింది. తేమ కోసం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టాం. ఒకటి రెండు రోజుల్లో కాంటాలు వేస్తే ఇక ఫలితం చేతికొచ్చినట్లే..’ అనుకున్న అన్నదాతలను గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం అంతులేని నష్టాన్ని మిగిల్చింది. కూసుమంచి మండలంలో నష్ట తీవ్రత అధికంగా ఉంది. చేగొమ్మ గ్రామంలో ధాన్యపు రాసులు నీట మునిగాయి. గాలిదుమారానికి ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షానికి ధాన్యమంతా తడిచిముద్దయింది. అలాగే, మరో 10 రోజుల్లో కోయాల్సి ఉన్న మామిడి పండ్లు కూడా ఈదురుగాలులకు నేలరాలాయి. కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనూ, కల్లాల్లోనూ ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. తన ఏడాది కష్టాన్ని సుమారు గంటపాటు- వచ్చిన ఈదురుగాలి, వర్షం నేలపాలు చేశాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

# రహదారుల అభివృద్ధితోనే పెట్టుబడులు సాధ్యం



(మొదటిపేజీ తరువాయి)
కార్యక్రమాలు జరగనున్నాయి. నితిన్ గడ్కారీ అదిలాబాద్ , హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. రహదారుల అనుసంధానం అన్నింటికంటే ముఖ్యమైనదని చెప్పారు. వాజ్ పేయీ హయాంలో స్వర్ణ చతుర్భుజి పథకాన్ని తెచ్చారని, రోడ్ల నిర్మాణంపై లక్షల కోట్లు ఖర్చు ఎందుకని ఆనాడు కొందరు విమర్శించారని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసిందని, కనెక్టివిటీ- కోసం మోడీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చుపెడుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్- శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్లు నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు. హైదరాబాద్- విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారికి యత్నిస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. గత 10 సంవత్సరాలలో జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, అన్ని రాష్ట్రాలరాజధానులను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడానికి కేంద్రం కృషి చేస్తున్నది. ఈ నిర్మాణం వెనుక ఉన్న ముఖ్యమైన అంశం తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ. 2014 వరకు రాష్ట్రంలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ప్రస్తుతం 5,200 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ విస్తరణ తెలంగాణలోని 32 జిల్లా కేంద్రాల గుండా జాతీయ రహదారుల అనుసంధానానికి తోడ్పడిందని అన్నారు. హైదరాబాద్-శ్రీశైలం రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా ప్రయాణానికి సంబంధించిన దూరం తగ్గించబడుతుంది. దీనితో పాటు-, హైదరాబాద్-విజయవాడ మధ్య జాతీయ రహదారికి 6 లేన్‌ల నిర్మాణం కూడా జరుగుతుందని ఆయన చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో కొన్ని చోట్ల భూ సేకరణ సమస్యలు తలెత్తుతున్నాయి. భూ సేకరణ ఆలస్యం అయితే, నిర్మాణం కూడా ఆలస్యం అవుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఎంత త్వరగా భూమి సేకరించబడితే, అంత త్వరగా రహదారుల నిర్మాణం పూర్తి అవుతుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వేలాదిమంది కోట్లతో వందల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరుగుతుంది. తెలంగాణకు సంబంధించి 5 ప్రధాన కారిడార్ల నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని కిషన్ రెడ్డి తెలిపారు.

# 42సార్లు ఢిల్లీ వెళ్లినా ఏం లాభం


- ఉపాధి కూలీల పనిదినాలు తగ్గినా పట్టింపేది
- సిఎం రేవంత్‌పై హరష్ రావు విమర్శలు




**హైదరాబాద్,దీక్షప్రభ:** ఉపాధి హామీ పనిదినాలు 2024-25 సంవత్సరానికి 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు తగ్గాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 42 సార్లు దిల్లీ వెళ్లినా ఉపాధి పనిదినాలు సగం తగ్గాయని విమర్శించారు. విషయం తెలిసినా కాంగ్రెస్, భాజపా ఎంపీలు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే కూలీల పనిదినాలు పెంచాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా.. తెలంగాణకు సాధించింది ఏం లేదని హరీష్‌రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు జరిగే నష్టంపై నోరు మెదపకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని.. వారి జీవితాలతో ఆడుకుంటు-ందని హరీష్‌రావు మండిపడ్డారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం రెండు కలిసి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని హరీష్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి మంజూరైనా నరేగా పనిదినాలను కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించడం శోచనీయమని అన్నారు. 2024-25లో రూ.12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా, ఈ సంవత్సరం కేవలం రూ. 6.5 కోట్ల పనిదినాలకే పరిమితం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 మంది ఎంపీలు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నరేగా పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 4 నెలల వేతనాలు చెల్లించాలని హరీష్‌రావు కోరారు.

# త్వరలో ఉస్మాన్ నగర్ రిజర్వాయర్ ప్రారంభం

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- నూతన రిజర్వాయర్ తో 27,497 ఇళ్లకు మంచినీటి సరఫరా
- 30 కోట్ల ఖర్చు, 20 కిలోమీటర్ల పైపులైన్







**రామచంద్రాపురం,దీక్ష ప్రభ:** శర వేగంగా విస్తరిస్తున్న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో మంచినీటి కొరతను తీర్చేందుకు శాశ్వత ప్రాతిపదికన నిర్మించిన నూతన రిజర్వాయర్ ను అతి త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 60 లక్షల లీటర్ల సామర్థ్యంతో 20 కిలోమీటర్ల పైపులైన్ తో నిర్మించిన రిజర్వాయర్లను శనివారం ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నూతన రిజర్వాయర్ ద్వారా ఉస్మాన్ నగర్ పరిధిలోని 55 కాలనీలకు మంచినీటి సరఫరా అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికి రక్షిత మంచినీరు అందించాలన్న సమున్నత లక్ష్యంతో నూతన రిజర్వాయర్లను నిర్మిస్తున్నామని తెలిపారు.ప్రజలకు కనీస అవసరాలు అయినా విద్యుత్తు, మంచినీరు అంతరాయం లేకుండా అందించినప్పుడే మరిగైన ప్రజా పాలన అందించినట్లు అవుతుందని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న తమకు ప్రజలు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం సుబ్బరాయుడు,డీజీఎంలు చంద్రశేఖర్, శిరీష,తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్,కమిషనర్ సంగారెడ్డి,స్థానిక నాయకులు ఉమేష్,రవీందర్ రెడ్డి, నరసింహ, శ్యామ్ రావు,దేవేందర్ యాదవ్, శ్రీనివాస్,మల్లారెడ్డి,సీనియర్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలి





- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్


**మెదక్ ప్రతినిధి,దీక్ష ప్రభ:** కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, సంబంధిత ఎంపీడీవో ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం సేకరణ, ట్యాబ్ ఎంట్రీలు ఐకేపీ,కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి దాకా సేకరించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం సేకరించిన వెంటనే వాటి వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు. నాణ్యతా ప్రమాణాలు మేరకు ధాన్యం తీసుకువచ్చిన రైతుల నుంచి నిబంధనల ప్రకారం తూకం వేయాలని ఆదేశించారు.ధాన్యం డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడేలా చూడాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు వివరాలు ట్యాబ్ ఎంట్రీ చేయని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐకేపీ, డీసీఎంఎస్, ప్యాక్స్, ఆధ్వర్యంలో ఇప్పటి దాకా 2715 మంది రైతుల నుంచి 53,602 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు.మొత్తం రూ. 28కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో వేశామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి జన్మదిన వేడుకలు



**జహీరాబాద్,దీక్ష ప్రభ:** సంగారెడ్డి జిల్లా శాసనసభ పరిది మండలంలోని శేఖాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి భాగ్యలక్ష్మి జన్మదిన వేడుకలు మండల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నాడు ఘనంగా జరిగింది. జన్మదిన వేడుకల్లో భాగంగా మండల పరిషద్ అభివృద్ధి అధికారి మహేందర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మికి శాలువకప్పి పులమలతో సత్కరించగా సహచర కార్యదర్శులు కేక్ కట్ చెయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేస్తూ నిత్యం గ్రామ సమస్యల గురించి ప్రస్తావిస్తూ అహర్నిశలు వాటి పరిష్కరం కోసం తపిస్తున్న కార్యదర్శి భాగ్యలక్ష్మి నిండు నూరేళ్ల ఆయుష్షు ఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.గత 3 సం రాలుగా శేకపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా భాగ్యలక్ష్మి విధులు నిర్వహిస్తు అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతున్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సమత,మొహమ్మద్ మాక్సుద్, నాగలక్ష్మి,సిబ్బంది మొహమ్మద్ మహేముద్,మొహమ్మద్ నసిరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నందికొట్కూరు లోబోర్ వెల్ హైవేపై లారీ బోల్తా



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు పట్టణ పరిధిలోని నేషనల్ హైవేపై లారీ బోల్తా పడింది.ఈ ఘటన శనివారం ఉదయం జరిగింది.స్థానికుల వివరాల మేరకు..కర్నూల్ నుంచి నందికొట్కూరుకు వెళ్తున్న బోర్ వెల్ లారీ నాగలూటి నందికొట్కూరు సర్వీస్ రోడ్ వద్ద ఆంజనేయస్వామి జంక్షన్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## టీడీపీ నాయకుడు కిరణ్ కు మాతృవియోగం

- నివాళులు అర్పించిన ఎమ్మెల్యే జయసూర్య

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కిరణ్ కుమార్ మాతృమూర్తి కొంకతి సుగుణమ్మ( 62) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు.మృతురాలు సుగుణమ్మ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు భర్త బాలన్న తెలిపారు.సుగుణమ్మ అకాల మరణం చెందారన్న విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య కొణిదెలలోని వారి నివాసానికి చేరుకొని ఆమె భౌతిక ఖాయాన్ని దర్శించుకొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరమార్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం సాయంత్రం అంత్యక్రియలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కట్టమంచి వళ్లపురెడ్డి జనార్దన్ రెడ్డి, సర్పంచ్ కొంగర నవీన్,రంగస్వామి, సీపీఎం బెస్త రాజు,ఎస్సీ ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు లింగాల నాగరాజు, ప్రతాప్,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు సభ్యులుగా చేరాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** ఉపాధి కూలీలంతా సభ్యులుగా చేరి సంఘం పెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు పిలుపునిచ్చారు. శనివారం నందికొట్కూరు మండలం కోనేటమ్మ పల్లె గ్రామంలో ఉపాధి పనులను సిఐటియు జిల్లా నాయకులు గోపాల్ కృష్ణతో కలిసి పరిశీలించడం జరిగింది. సందర్భంగా ఉపాధి కూలీల ఉద్దేశించి ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీరం చేసేందుకు కేంద్ర బడ్జెట్ లో నిధులు తగ్గించాలని, వేసవిలో ఇస్తున్న సమ్మర్ అలవెన్స్ ను రద్దు చేశారని,గడ్డపార, గంప ,నీటికి ఇస్తున్న అలవెన్స్ ప్రస్తుతం ఇవ్వడం లేదని వారు విమర్శించారు.పనిచేసిన కూలీలకు ప్రతివారం కొలతలు వేసి పే స్లిప్పులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.వేసవికాలంలో వడదెబ్బ నివారించేందుకు ఉపాధి కూలీలకు పనుల దగ్గర మజ్జిగ పంపిణీ చేయాలని ఆయన కోరారు.ఉపాధి కూలీలందరికీ పనిముట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు, ఉపాధి మేటీలకు ఐదు రూపాయలు పారితోషకం,సెల్ఫోన్ ఇవ్వాలని వారు కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనాలను 500 కు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం 9 మందితో గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది కమిటీ అధ్యక్షులుగా ప్రకాశం,ఉపాధ్యక్షులు సంపత్ కుమార్, కార్యదర్శిగా నాగభూషణం,సహాయ కార్యదర్శి బి భూపాల్ కమిటీ సభ్యులుగా కృష్ణ, వసంత, ఈమెలమ్మ, దేవరాజు, సువర్ణమ్మతో కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిఏ నాగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సుధీర్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## రహిమాన్ (లాడెన్ ) కూతురు మృతికి ఎమ్మెల్యే నివాళులు



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంకు చెందిన రహిమాన్ (లాడెన్ ) కూతురు కరీమున్నిసా అనారోగ్యం తో మరణించడం జరిగింది.అది తెలుసుకున్న నందికొట్కూరు నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య,నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి,జయరామి రెడ్డి,సర్వోతం రెడ్డి,కైలుల్లా బేగ్, ఫరూక్, తస్లీమ్,అల్లాబకాష్ తదితరులు పార్థివదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

# నందికొట్కూరు పట్టణంలో ఘనంగా ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

- రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు టోపీలు పంపిణీ







**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** పత్రికా స్వేచ్ఛ శక్తివంతమైన ఆయుధంగా తీర్చిదిద్దినప్పుడే ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుందని, పత్రికా స్వేచ్ఛను కాపాడడం అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ బేబీ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కమీషనర్ ఛాంబర్ లో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి తుపాకుల రమేష్,కార్యవర్గ సభ్యులు భూపాల్,శివ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మానవ హక్కుల పరిరక్షణకు ప్రధాన ధ్యేయమని తరాల హక్కులను పరిరక్షించేందుకు పత్రికా స్వేచ్ఛ చోదక శక్తిగా నడుం బిగించేందుకు అందరూ తోడ్పాటు అందించాలని కోరారు.పత్రికా స్వేచ్ఛకు పట్టం కట్టాలన్న స్ఫూర్తితో 1997 నుంచి మే 3న పత్రికా స్వేచ్ఛ అవార్డును ప్రధానం చేయడం కారణమన్నారు. ఎన్ని సవాళు ఎదురైనా ప్రసార మాధ్యమాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల తోడుగా నిలువాలని తెలిపారు.పత్రికా స్వేచ్ఛ లోపించిన ప్రజాస్వామ్యం అసంపూర్ణమని, కలం గళానికి స్వేచ్ఛ ఉన్నప్పుడే అది నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందు ఉంచగలదని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బేబీ, మున్సిపల్ మేనేజర్ సుప్రాలత, డిఈ నాసిర్,ఆర్వో మధుసూదన్ బాబు పత్రికా విలేకరులకు పత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి టోపీలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు నగేష్,పాత్రికేయులు జయరాజు,జలీల్,ఆంజనేయులు, స్వామన్న, సుబ్బన్న, పరమేష్, రామకృష్ణ,స్వామన్న,శేషన్న, స్వాములు,రహంతుల్లా, అబ్దుల్లా, డాలు శేషు,ఉమర్,తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సరఫరాకు సిద్ధమైన బంధంకొమ్ము రిజర్వాయర్

- అతి త్వరలో మంచినీటి సరఫరా ప్రారంభం
- రూ.10 కోట్ల ఖర్చుతో రెండు మిలియన్ లీటర్ల సామర్థ్యంతో రిజర్వాయర్
- 30 వేల జనాభాకు నీటి సరఫరా
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**అమీన్ పూర్,దీక్ష ప్రభ:** అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని బంధంకొమ్ము కృష్ణ బృందావన్ కాలనీలో 20 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన నూతన రిజర్వాయర్ ను అతి త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులతో కలిసి రిజర్వాయర్ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదేళ్ల క్రితం వరకు అమీన్ పూర్ పరిధిలో నిత్యం మంచినీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారిని తెలిపారు. 2014 నుండి నేటి వరకు ప్రణాళికాబద్ధంగా నూతన రిజర్వాయర్లు నిర్మిస్తూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుభవంగా నూతన కాలనీలకు సైతం మంచినీరు అందించేందుకు ప్రణాళికల సిద్ధం చేస్తున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలోనే బంధంకొమ్ములో 20 లక్షల లీటర్ల సామర్థ్యంతో 10 కోట్ల రూపాయలతో 8 కిలోమీటర్ల పైపు లైన్ సామర్థ్యంతో 30 వేల మంది జనాభాకు మంచినీటిన అందించేందుకు రిజర్వాయర్ నిర్మించడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో రిజర్వాయర్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఐదు రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టగా మూడింటి నీ ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తు అవసరాల అనుగుణంగా రిజర్వాయర్లను నిర్మిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి,జలమండలి జీఎం సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి,డీజిఎం చంద్రశేఖర్,మేనేజర్ పూర్ణేశ్వరి, సీనియర్ నాయకులు గోపాల్, ఉపేందర్ రెడ్డి,రాజు,కొల్లూరి మల్లేష్,యూసుఫ్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలబడేది జర్నలిజం

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా నందికొట్కూరు మున్సిపాలిటీ కార్యాలయం అంబేద్కర్ సర్కిల్లో విశాలాంధ్ర విలేఖరి ఆంజనేయులు ఆంధ్రప్రభ విలేకరి పరమేష్ కి శాలువాలతో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు కాటపోగు సోమన్న వేల్పుల ఏసన్న.వి సుధాకర్ శాలువతో సన్మానం చేయడం జరిగింది.అనంతరం పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..పత్రికా రంగంలో పనిచేసే పత్రిక విలేకరులు స్వేచ్ఛగా నిజాన్ని నిర్భయంగా రాయాలని సమాజంలో అవినీతిని వెలికితీయాలని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలబడేది పత్రికని అలాంటి రంగంలో మీరు నిస్వార్థంగాపనిచేయడం నేను గర్వపడుతున్నానని తెలిపారు.నేడు జరుగుతున్న అవినీతి యుద్ధంలో పత్రికారంగం ముందుండాలని పత్రికా మిత్రులు ప్రజల వానిని వినిపించే విధంగా ఉండాలన్నారు.అయితే నేటి ప్రభుత్వాలు పత్రిక రంగంలో పనిచేస్తున్న వారిని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వారి గొంతును నొక్కుతూ వారి పైన దాడులకు పాల్పడుతూ పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని అన్నారు.పత్రికా రంగంలో పనిచేసే జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇచ్చి గౌర వేతనంతోపాటు. ఇంటి స్థలాలు ఇల్లు ప్రైవేటు పాఠశాలలో వారి పిల్లలకు రాయితీ బస్సు పాసులు.సౌకర్యం కల్పించాలని జర్నలిస్టుల పైన దాడులకు పాల్పడితే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పత్రిక యూనియన్ నాయకులు జయరాజు,డాలు శేషు, సోమన్న, ఉషనాళం, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# సూర్యవర్ధనికి గణితంలో పీహెచ్ డీ



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ఎ.సూర్యవర్ధని డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'పారాడిస్ట్రిబ్యూటివ్ లాటికాయిడ్స్' అనే అంశంపై అద్భుతమైన సిద్ధాంత వ్యాసాన్ని ఆమె సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రామకోటేశ్వరరావు, సహ మార్గదర్శి వీఐటీ ఏపీ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రవికుమార్ శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ సూర్యవర్ధని పరిశోధన లాటిస్ సిద్ధాంతం యొక్క లోతులను అన్వేషించడంతో పాటు గణితం, కంప్యూటర్ సైన్స్, లాజిక్, ఇంజనీరింగులో సుదూర అనువర్తనాలు కలిగినదని తెలిపారు.ఆమె అధ్యయనం డిస్ట్రిబ్యూటివ్ లాటిస్లు,బిర్కాఫ్ వ్యవస్థలను సాధారణీకరించే ఒక నూతన బీజగణిత నిర్మాణాన్ని పరిచయం చేస్తుందన్నారు. గణిత క్రమం,సోపాన క్రమం,ఆప్టిమైజేషన్ నమూనాలను బాగా అర్థం చేసుకోవడానికి దోహద పడుతుందని తెలిపారు. ముఖ్యంగా,ఆమె బిర్కాఫ్ సిద్ధాంతాన్ని ఉపయోగించి అసోసియేటివ్ పారాడిస్ట్రిబ్యూటివ్ లాటికాయిడ్ల కోసం సబ్ డైరెక్ట్ ప్రాతినిధ్య సిద్ధాంతంతో పాటు సంక్లిష్టమైన గణిత విశ్లేషణ కోసం సరళీకృత విధానాలను అందించిందని వివరించారు. డాక్టర్ సూర్యవర్ధని సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా,పలు విభాగాల అధిపతులు,అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్లు పేర్కొన్నారు. పరిశోధనా నైపుణ్యాన్ని పెంపొందించడానికి, అధునాతన విద్యా కార్యకలాపాల ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి గీతం కట్టుబడి ఉందన్నారు.

# రైతును విస్మరించిన కాంగ్రెస్

- కాంగ్రెస్‌పై భ్రమలు తొలగి పోయాయి

**నిజామాబాద్:** వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు ఉచితంగా ఎరువులు ఇవ్వడంలేదు. రుణమాఫీ సరిగా చేయలేదు. కనీస మద్దతు ధరకు పంటల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని శనివారం నాడిక్కడ తనను కలిసిన మీడియా మిత్రులతో అన్నారు. ఇందులో భాజపా పాత్ర కూడా ఉందని ఆరోపించారు. తెలంగాణ సమాజానికి కాంగ్రెస్ పాలన ప్రమాదకరంగా మారిందని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని అన్నారు. అన్నదాతలకు బిఆర్ఎస్, కెసిఆర్ ఎప్పుడూ అండగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ఏర్పాటు వల్ల రైతులు, వారి కుటుంబాలు బాగుపడ్డాయని అన్నారు. ఒక్కకెసిఆర్ మాత్రమే రైతులకు మేలు చేయగలరని ప్రజలకు కూడా తెలిసిపోయిందని అన్నారు.

# మద్య నియంత్రణతోనే నేరాలకు అడ్డుకట్ట!

భారీగా మద్యం అమ్మకాలు సాగాలన్నదే ప్రభుత్వాల లక్ష్యంగా ఉంది. మద్యంతో ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ప్రభుత్వాలు గమనించడం లేదు. మద్యం ఆదాయంతో కిలో రూపాయి బియ్యం, పెన్షన్లు ఇవ్వడానికి, ఉచి పథకాలకు ప్రభుత్వాలు అలవాటు పడ్డాయి. అందుకే మద్యనిషేధాన్ని అమలు చేయడం లేదు. తాగి చచ్చినా ఫర్వాలేదు... మద్యం అమ్మకాలు సాగాలి.. ఆదాయం పెరగాలన్న ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఇందుకు భిన్నంగా లేవు. నిజానికి ఉచిత పథకాలు ఆపితే మద్యం అమ్మకాల వైపుచూడాల్సి రాదు. తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలపై అదుపు లేకుండా పోతోంది. మద్యం ధరలు పెంచినా అమ్మకాలు ఆగడం లేదు. మద్యం ప్రధాన ఆదాయ వనరు కావడంతో తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలపై అజమాయిషీ లేకుండా పోతోంది. బ్రాండ్ ఏదైనా డబ్బులు తెచ్చి పెడుతోంది. మద్యం, గంజాయి వంటివి అందుబాటులో ఉండడంతో జులాయిలు అకృత్యాలకు తెగబడుతున్నారు. మత్తులో ఉన్న వారిలో దూకుడు స్వభావం, విపరీత ధోరణి ఉంటుంది. ఇదే నేరాలకు దారి తీస్తోంది.విపరీత ప్రవర్తన, సమాజంపై ద్వేష భావం ఉండేవారికి మద్యం మత్తు తోడైతే అది తీవ్రమైన నేరాలకు కారణమవుతుంది. అందువల్ల మద్యం,గంజాయి లభ్యం కాకుండా అరికట్టే మార్గాలు ఆలోచించాలి. అకృత్యాల కట్టడికి ఏం చేయాలన్నది చర్చించాలి. మహిళలపై లైంగిక నేరాలు, అత్యాచారాలకు పాల్పడు తున్న వారిలో మద్యం మత్తులో ఉన్నవారెందరన్నది గణాంకాలు తీయాలి. అలాగే ఎక్కడపడితే అక్కడ మద్యం లభిస్తోంది. దీనికి తోడు గంజాయి లభ్యత కూడా పెరిగింది. చెడు సావాసాలతో మత్తులో మునిగి నేరాలకు పాల్పడుతున్నారు. దీనికంతటకీ నిరుద్యోగం, పనులు లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఇవన్నీ అరికట్టేందుకు ఏం చూయాలో ఆలోచించి ముందుకు కదిలితేనే నేరాలను అరికట్టగలం. ఇటీవల గంజాయి కూడా విపరీతంగా పట్టుబడుతోంది. ఎంతగా స్వాధీనం చేసుకున్నా రవాణా ఆగడం లేదు. దీనికి కారణం మార్కెట్లో డిమాండ్ కారణంగా గంజాయి పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో మద్యం అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలతో పాటు నేరాలు, ఘోరాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. అత్యాచారలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు ఇలా అనేక రకాలైన నేరాలకు మద్యం కారణం అవుతోంది. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని అధికారంలోకి వచ్చినప్పుడు నాటి సిఎం జగన్ హామీ ఇచ్చి డొల్ల కంపెనీల బ్రాండ్లతో వేలకోట్లు సంపాదించారు. మద్యం కుంభకోణంపై ఇప్పుడు సిట్ విచారణ సాగుతోంది. మద్యం అమ్మకాలు లేకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితిలో లేదు. దీంతో మద్యం అమ్మకాలను బాహాటంగానే ప్రోత్సహిస్తున్నారు. ఇష్టం వచ్చిన బ్రాండ్లతో అమ్మకాలు చేసి ఖజానా నింపుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడా..ఇక్కడా అన్న తేడా లేకుండా నేరాలు పెరుగుతున్నాయి. అంతెందుకు పార్టీ కార్యకర్తలకు మందు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. పార్టీ ఏదైనా.. కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యంతోపాటు ముక్క లేనిదే కదలడం లేదు. అత్యాచార ఘటనల్లో అనేకం కేవలం మద్యం కారణంగానే జరిగినట్లుగా గుర్తించారు. రేపిస్టులకు కఠిన శిక్షలు పడితే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవు. ప్రభుత్వం తాము కఠినంగా ఉన్నామని అనుకుంటే సరిపోదు. కఠినంగా ఉంటున్నారన్న సందేశం ప్రజల్లోకి వెళ్లగలిగేలా చేయాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు జరగవు. అలా చేయాలనుకున్న వారు కూడా జంకుతారు.అక్రమాలు, అకృత్యాలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండడం వల్లనే దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. అవి ఒక్క ఎపిలోనే జరుగు తున్నాయని చెప్పడానికి లేదు. తెలంగాణతో పాటు ఘనత వహించిన యూపిలో కూడా జరుగుతూనే ఉన్నాయి. గొప్పలుచెప్పుకుంటున్న కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న కేరళలోనూ జరుగుతున్నాయి. రాక్షసులకు ప్రాంతం ఏదన్నది ముఖ్యం కాదు. రాక్షస ప్రవృత్తి ఉన్నవారు ప్రపంచమంతా నిండి ఉన్నారు. అలాంటి వారికి మద్యం తోడవుతోంది. వారికి కఠిన శిక్షలు అమలు చేయాల్సి ఉంది. ఏదైనా అరాచక సంఘటన జరిగినప్పుడు ఉమ్మడిగా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆలోచనచేయాలి. ఇకపోతే ఇటీవల చోటు చేసుకుంటున్న సామూహిక అత్యాచార ఘటనలను చూస్తే సామాన్యులకు కూడా భయమేస్తోంది. బయటకు రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపిల్లలను కూడా వదలడం లేదు.

# అంగన్ వాడి రంగాన్ని ప్రైవేటీకరణ చేయటం వెంటనే విరమించుకోవాలి



- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు
- ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మె కరపత్రం విడుదల

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** అంగన్ వాడి రంగాన్ని ప్రైవేటీకరణ ఆపాలని, అంగన్వాడీ టీచర్లను, ఆయాలను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు,జిల్లా ఉపాధ్యక్షురాలు మంగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పటాన్ చెరు పట్టణంలో జరిగిన అంగన్ వాడి టీచర్ల సమావేశంలో ఈ నెల 20న జరిగే సమ్మె కరపత్రంను విడుదల చేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ..అంగన్వాడి రంగాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఈ స్కీమును పూర్తిగా వదిలించుకునే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ఐసిడిఎస్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఐసిడిఎస్ వ్యవస్థను రక్షించుకోవడానికి అనుగుణంగా బడ్జెట్లో తగినంతగా కేటాయింపులు చేయడం లేదని తెలిపారు. దేశంలో నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, పేదరికం, గౌరవప్రదమైన వేతనాలు లేకపోవడంతో ఐసిడిఎస్ వ్యవస్థను పటిష్టం చేయడం మరింత అవసరమన్నారు.కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నదని ఆరోపించారు.ఇందులో భాగంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా అమలును తీవ్రతరం చేసిందని, ఇవి అమలులోకి వస్తే కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను హరించబడతాయన్నారు. ప్రభుత్వ రంగాలను పూర్తిగా తుంగలో తొక్కి ప్రైవేటీకరణకు స్వాగతం పలుకుతున్నారని ఆరోపించారు. అంగన్వాడి రంగంలో వస్తున్న వేతనాలు టీచర్లకు,ఆయాలకు ఏమాత్రం సరిపడడం లేదని అన్నారు.గత పది సంవత్సరాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, అంగన్వాడి రంగంలో వస్తున్న సమస్యల సాధన కోసం మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా యూనియన్ నాయకురాలు శశికళ,కల్పన, యేసుమని,వజ్రమని,రేణుక, నాగలక్ష్మి,శోభ రాణి,విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కోసం లొల్లి..లొల్లి..!



- రెండు వర్గాలుగా చీలిన కాంగ్రెస్
- నిన్న ఒక వర్గం..నేడు మరో వర్గం ఫిర్యాది

**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని.. ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం తలనొప్పిగా మారింది. ఇండ్ల కోసం కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.తమ వారికే ఇండ్లు కేటాయించాలని, లేకపోతే నష్టం తప్పదని నాయకులు హెచ్చరిస్తున్నారు.ఇందిరమ్మ ఇండ్ల కోసం కాంగ్రెస్‌లో రెండు వర్గాలుగా చీలిన ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని పెద్దనాగారం గ్రామంలో కాంగ్రెస్‌లో మొన్నటి వరకు అంతా బానే కనిపించినా.. ఇందిరమ్మ ఇల్లు రావటంతో అసలు కథ ఇప్పుడే షురూ అయిందన్న టాక్ వినిపిస్తోంది. దీంతో గ్రామంలో అధికార పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయిందని..పాత, కొత్త కాంగ్రెస్ పార్టీ అంటూ క్యాడర్ కూడా రెండు వర్గాలుగా విడిపోయారనే చర్చ జరుగుతోంది. ఇక్కడ వరకు బాగానే ఉన్నా అసలు కథ మొదలైంది. ఇందిరమ్మ ఇల్లు గ్రామంలో ధనికులకే కేటాయించారని శుక్రవారం ఓవర్గం ఫిర్యాదు చేయగా.. నేడు మరో వర్గం అర్హులకే కేటాయించారని ఎంపీడీవో కిన్నెర యాకయ్యకు వినతి పత్రం చేశారు. గతంలో ఎస్సీ కాలనీవాసులకు ఇల్లు వచ్చిన.. మళ్లీ తమకు రాలేదని చెప్తున్నారని ఆరోపించారు.ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో కొందరు తమ పేర్లు రాకపోవడంతో మండిపడ్డారు. సంబంధిత అధికారులు నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో పెద్దనాగారం కాంగ్రెస్‌లో కొత్త, పాతల పంచాయితీ ఎక్కడ వరకు దారితీస్తుందో వేచి చూడాలి మరి.

Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar.** RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com